క్లుప్తంగా

ఆస్పత్రిలో అభివృద్ధి పనుల పరిశీలన



ఆస్పత్రిలో పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ

చేజర్ల: చేజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంపీపీ తూమాటి విజయభాస్కర్ శుక్రవారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పనులు చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట డాక్టర్ మెహతాబ్, సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పొలం వివాదంపై ఆర్డీఓ విచారణ

సోమశిల: అనంతసాగరం మండలం పాతాళపల్లిలో ఇరువర్గాల మధ్య పొలాల వివాదంపై ఆత్మకూరు ఆర్డీఓ కురబ మధులత శుక్రవారం విచారణ చేశారు. ఆర్డీఓ ఇరువర్గాలను పిలిచి వివరాలు సేకరించారు. హద్దులు ఏర్పాటు చేయాలని గ్రామ సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారిని ఆమె ఆదేశించారు. ఆర్డీఓ మధులత మాట్లాడుతూ కలెక్టర్‌కు స్పందనలో పొలం వివాదంపై వినతిపత్రం సమర్పించారని తెలిపారు. తహసీల్దారు సుభాషిణి, ఆర్‌ఐ ప్రభాకర్ ఉన్నారు.

బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ నియామకం



మల్లికార్జునరెడ్డి

మర్రిపాడు: బీజేపీ ఆత్మకూరు నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్‌గా మర్రిపాడు మండలం రాంపల్లికి చెందిన కంది మల్లికార్జునరెడ్డిని అధిష్టానం నియమించింది. మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ తనను నియోజకవర్గ కన్వీనర్‌గా నియమించిన అధిష్టానికి రుణపడి ఉంటానని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

పీహెచ్‌సీలో మహిళకు కాన్పు



సోమశిల: అనంతసాగరం పీహెచ్‌సీలో డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓ మహిళకు శుక్రవారం కాన్పు చేశారు. మండలంలోని పడమటిఖమ్మంపాడుకు చెందిన షేక్ షకీలకు పురిటి నొప్పులు రావడంతో అత్యవసరంగా కుటుంబ సభ్యులు స్థానిక పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. డాక్టర్ పర్యవేక్షణలో సాధారణ కాన్పు జరగడంతో మగబిడ్డను ప్రసవించింది. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారు. అనంతరం తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో వారిని క్షేమంగా ఇంటికి చేర్చారు. పీహెచ్‌సీ స్టాఫ్ నర్సులు మౌనిక, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

సర్వేలు నూరు శాతం పూర్తి చేయాలి



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ ఈశ్వరమ్మ

ఉదయగిరి: గ్రామ సచివాలయ పరిధిలోని వలంటీర్లకు కేటాయించే సర్వేలను సకాలంలో నూరుశాతం చేపట్టి లక్ష్యాన్ని సాధించాలని ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ అన్నారు. ఆమె శుక్రవారం మండలంలోని వెంగళరావునగర్ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి హీనా, వెల్ఫేర్ సహాయకులు మమత పాల్గొన్నారు.

కుల గణన సర్వేపై సమీక్ష నేడు

ఆత్మకూరు: కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో త్వరలో చేపట్టనున్న కుల గణన సర్వేకు సంబంధించి సమీక్ష సమావేశం శనివారం మున్సిపల్ కార్యాలయంలోని ఎంజీఆర్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ బల్లి నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ఈ సమీక్షలో పలువురు జిల్లా స్థాయి అధికారులు డివిజన్ స్థాయి సిబ్బంది పాల్గొంటారని వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు.

కుల గణనకు ప్రత్యేకాధికారులు

వరికుంటపాడు: మండలంలో త్వరలో జరగనున్న కుల గణన సర్వే పర్యవేక్షణకు 12 సచివాలయాలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఎంపీడీఓ చేవూరి శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయాలకు కేటాయించిన ప్రత్యేక అధికారులు సచివాలయ సిబ్బంది, వలంటీర్లను సమన్వయం చేసుకుంటూ కుల గణన సర్వే తప్పులు లేకుండా నిర్వహించేటట్లు పర్యవేక్షించాలన్నారు. పక్కాగా సర్వే నిర్వహించేలా సహకరించాలన్నారు.

విమానం చూపు..
దామవరం వైపు

- విమానాశ్రయానికి సిద్ధంగా ఉన్న 1,379 ఎకరాల భూమి
- విస్తరణకు అవసరమైన 480 ఎకరాలూ సిద్ధమే
- ఇప్పటికే ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) సాంకేతిక అనుమతులు మంజూరు
- రెండు సీ పోర్టులు, ఫిషింగ్ హార్బర్‌కు సమీపం
- సరుకు ఎగుమతులు (కార్గో)కు అనుకూలం

కావలి: కావలి నియోజకవర్గం దగదర్తి మండలం దామవరం వద్దనే విమానాశ్రయం నిర్మాణంపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. ఈ దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకోవడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. కావలి సమీపంలో గుడ్లూరు మండలం సముద్ర తీర ప్రాంతం రామయపట్నంలో పోర్టును నిర్మిస్తుండడంతో, దానిని ఆనుకునే తెట్టు–మోచర్ల గ్రామాల నడుమ విమానాశ్రయం నిర్మించాలని తలచారు. అయితే అక్కడ విమానాశ్రయానికి అవసరమైన భూములు ఎక్కువగా అటవీశాఖకు చెందినది కావడం, భూసేకరణ ప్రక్రియకు కేంద్రం అనుమతి రావడంతోపై సందిగ్ధత ఉండడం, ఆ ప్రాంతంలో విమానాశ్రయం నిర్మిస్తే విమానాలు ల్యాండింగ్ (దిగడం), టేకాఫ్ (ఎగరడం)కు అనుకూలత లేదని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ప్రభుత్వ వర్గాలకు తెలియజేసింది. దీంతో ఈ ప్రాంతంలో విమానాశ్రయం నిర్మాణం జఠిలం కావడంతో పాటు ఆలస్యం అవుతుందనే భావంతో ప్రభుత్వం పునరాలోచనలో పడింది.

దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జిల్లా ప్రజల్లో చిగురించిన ఆశలను నేడు ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఆచరణలో పెట్టడానికి అన్నీ ప్రక్రియలను పూర్తి చేస్తున్నారు. రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో దామవరంలో విమానాశ్రయం నిర్మించడానికి ఆమోదం లభించడం, డీపీఆర్ (వివరాత్మక ప్రాజెక్టు నివేదిక) పంపడంతో జిల్లాలో విమానాశ్రయం నిర్మాణంపై మళ్లీ కదలిక వచ్చింది. కావలి నియోజకవర్గం దామవరం, కందుకూరు నియోజకవర్గం తెట్టు ప్రాంతాల్లో ఏర్పాటుపై గత కొంత కాలంగా తర్జన భర్జనలు జరుగుతున్నాయి. అయితే ఇప్పటికే దామవరంలో విమాశ్రయం నిర్మాణానికి భూసేకరణ పూర్తి కాగా, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా సాంకేతిక అనుమతులు సైతం లభించాయి. అయితే జిల్లాల పునర్విభజన తర్వాత కందుకూరు నియోజకవర్గం కూడా జిల్లా పరిధిలోకి వచ్చింది. సమీపంలో రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ దశలో అక్కడికి సమీపంలోనే ఎయిర్‌పోర్టు నిర్మించాలనే ప్రతిపాదనలు రావడంతో ఆ దిశగా అధికారులు కసరత్తు చేశారు. అయితే అక్కడ ఎయిర్‌పోర్టుకు అనువుగా ప్రభుత్వ, ప్రైవేట్ భూములు అందుబాటులో లేవు. ఎయిర్‌పోర్టుకు అవసరమైన భూమంతా అటవీశాఖ నుంచి సేకరించాల్సి ఉంది. ఇదే సమయంలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా కూడా సాంకేతిక పరమైన సమస్యలు ఉన్నట్లు చెప్పడంతో.. ప్రభుత్వం సైతం తిరిగి దామవరం వద్ద నిర్మాణానికి మొగ్గు చూపుతున్నట్లు అధికార వర్గాల ద్వారా సమాచారం అందుతోంది.







చెన్నై- కోల్‌కోతా జాతీయ రహదారి నుంచి ఎయిర్‌పోర్టు ప్రతిపాదిత ప్రాంతానికి వెళ్లే దారి, దామవరం రోడ్డును క్రాస్ చేసే జాతీయ రహదారి ప్రాంతం



దామవరం వద్ద ఎయిర్‌పోర్టుకు సేకరించిన భూములు

ఐదు సంస్థలు ఆసక్తిని చూపాయి. ఇవన్నీ కూడా 2021 మే నెలలో జరిగింది. అనంతరం తెట్టు–మోచర్ల ప్రాంతంపై దృష్టి పెట్టడంతో దామవరం ప్రతిపాదనలు పక్కన పెట్టారు. తాజాగా ప్రభుత్వ వర్గాలు దామవరం పైనే దృష్టి సారించింది. రామాయపట్నం పోర్టు, కృష్ణపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లకు సమీపంలో జాతీయ రహదారిపై దామవరం ఉండడంతో సరుకు రవాణా ప్రాతిపదికగా (కార్గో) విమానాశ్రయంగా నిర్మించడానికి అనుకూలంగా ఉంటుందని ప్రభుత్వం ఆలోచనకు వచ్చింది. ఇదే సమయంలో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి దామవరంలో విమానాశ్రయం నిర్మాణ కోసం ప్రభుత్వంలోని ఉన్నత వర్గాల ద్వారా విశ్వ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. అందుకు రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, లోక్‌సభ సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి కూడా తమ వంతుగా ఎమ్మెల్యే కృషికి మద్దతుగా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లా అధికార యంత్రాంగం విమానాశ్రయం కోసం దగదర్తి మండలంలోని దామవరం, కొత్తపల్లి కౌరుపల్లిగుంట (కేకేగుంట) గ్రామాల్లో విమానాశ్రయం కోసం 1,379 ఎకరాల భూమిని సేకరించి సిద్ధం చేశారు. మరో 480 ఎకరాలు అటవీ శాఖ భూములను సేకరించడానికి అధికారులు రంగం సిద్ధం చేశారు.

కావలి ప్రజల కల నిజమవడానికి ప్రయత్నిస్తున్నాం



దామవరంలో విమానాశ్రయం నిర్మాణం అనేది కావలి ప్రజల కల. నిజం చేయడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాను. అందుకు ఎంపీలు, మంత్రులు సహకరిస్తున్నారు. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణం జరుగుతుండడంతో విమానాశ్రయానికి ప్రయాణికులతో పాటు పెద్ద ఎత్తు సరుకులు ఎగుమతులు అవుతుంది. భవిష్యత్తులో విమానాశ్రయం విస్తరించడానికి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన భూమిని ఇప్పుడే సేకరించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నాం.

– రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే, కావలి

భూములు సిద్ధంగా ఉన్నాయి



దామవరంలో విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన భూములు సిద్ధంగా ఉన్నాయి. భవిష్యత్‌లో విమానాశ్రయ విస్తరణకు కోసం కావాల్సిన భూమిని సేకరించడానికి కూడా అన్ని చర్యలు తీసుకున్నాం. ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా భూసేకరణ పనులు చేస్తాం.

– వీకే శీనా నాయక్, ఆర్డీఓ, కావలి

చంద్రబాబు ప్రభుత్వం డ్రామా

చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే టీడీపీ నేతలు విమానాశ్రయం నిర్మించతల పెట్టిన భూములు ఉన్న ప్రాంతంపై రాబందుల్లా వాలిపోయారు. దామవరంలో ఉన్న ప్రభుత్వ భూములకు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్లు చేయించారు. దామవరంలో విమానాశ్రయ నిర్మాణానికి భూసేకరణ ఇబ్బందిగా మారడంతో ఒక దశలో ఎయిర్‌పోర్టును టీడీపీ రద్దు చేసింది. దీంతో రాజకీయ పార్టీలు టీడీపీ ప్రభుత్వ వైఖరిని తూర్పారబట్టాయి. ప్రజల్లో కూడా పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. తిరిగి విమాశ్రయం నిర్మాణానికి తలొగ్గింది.

- 1,352 ఎకరాల్లో రూ.398.56 కోట్లతో దామవరంలో విమానాశ్రయం నిర్మించడానికి ఒక సంస్థకు సెప్టెంబర్ 2017 నిర్మాణ సంస్థకు చంద్రబాబు అప్పగించారు.
- 21 జూన్ 2018లో నిర్మాణ సంస్థతో ప్రభుత్వం అగ్రిమెంట్ చేసుకుంది. 21 డిసెంబర్ 2018 నాటికి కూడా నిర్మాణ సంస్థ తన ఆర్థిక వనరులను ప్రభుత్వానికి చూపలేక విఫలమైంది.
- అయినప్పటికీ అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు అసెంబ్లీ ఎన్నికలు సమీపించడంతో ప్రజలను మభ్యపెట్టేందుకు విమానాశ్రయ నిర్మాణానికి 11 జనవరి 2019 శంకుస్థాపన చేశారు.
- ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయితే నిర్మాణ సంస్థ నుంచి విమానాశ్రయానికి ఎటువంటి సుముఖత రాకపోవడంతో 15 జూలై 2019లో అగ్రిమెంట్‌ను రద్దు చేసింది.

చరిత్రలో నిలిచిపోయేలా ప్రజాపాలన

- సంక్షేమ పథకాలతో పేదరిక నిర్మూలన
- విద్య, వైద్య, ఉపాధి రంగాలకు పెద్దపీట
- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి



లబ్ధిదారులకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాపాలన అందిస్తున్నారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాలతో పేదరికం నిర్మూలనతో పాటు విద్య, వైద్య, ఉపాధి రంగాలకు పెద్దపీట వేయడం ద్వారా ప్రతి కుటుంబానికి అండగా నిలిచినట్లు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 12వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. వార్డు పరిధిలోని ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించే బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పాలనలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మాదిరి జన్మభూమి కమిటీల పేరుతో పేదల నెత్తిన పెత్తందారీ వ్యవస్థను పెట్టకుండా సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రతి పథకాన్ని నేరుగా లబ్ధిదారుల ఇంటి ముంగిటకే తీసుకువెళుతున్నట్లు వివరించారు. పార్టీలతో పని లేకుండా, నాయకుల సిఫార్సులు అవసరం లేకుండా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి పథకాలు అందించే ప్రజాపాలనకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా నవరత్నాలను అమలు చేస్తూ ప్రతి కుటుంబానికి భరోసాగా నిలిచినట్లు వివరించారు. డ్వాక్రా, ఆసరా, చేయూత, రుణాలు, ఉపాధి కల్పనపై శిక్షణ తదితర కార్యక్రమాలతో మహిళలకు, రైతుభరోసా కేంద్రాలు, రుణమాఫీ, రైతు భరోసా, పంటల బీమా తదితర పథకాలతో రైతులకు, నాడు–నేడు, విద్యాదీవెన, వసతిదీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్, తదితర పథకాలతో విద్యార్థులకు, ఇలా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా నిలిచినట్లు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో కార్పొరేట్ వైద్యాన్ని గ్రామాలకు తీసుకువెళ్లి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, అక్కిలిగుంట మాల్యాద్రి, చేవూరి కిరణ్‌కుమార్, దావులూరి శ్యాంసన్, కుందుర్తి శ్రీనివాసులు, కుందుర్తి కామయ్య పాల్గొన్నారు.

ఉదయగిరి జిల్లా సాధనతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న వేణుగోపాల్

ఉదయగిరి: దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని ఉదయగిరిని జిల్లా కేంద్రంగా చేసుకుంటేనే ఈ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని జిల్లా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. ఆయన శుక్రవారం పట్టణంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి జిల్లా సాధన వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం పునరాలోచించి ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాల్లో మెట్ట మండలతో ఉదయగిరి కేంద్రంగా జిల్లా చేయాలన్నారు. జిల్లా ఆవశ్యకతను విద్యార్థులకు వివరించి జిల్లా సాధనలో పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన సమితి నాయకులు దస్తగిరి అహ్మద్, రామిరెడ్డి, శివశంకర్, ఖాదర్ బాషా, కళాశాల యాజమాన్యం మైనుద్దీన్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి



కావలి పట్టణంలోని సిరిపురం రోడ్డులోని నాగులపుట్ట వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కార్తీక మాసం శుద్ధ చవితిని నాగులచవితిగా జరుపుకోవడం ఆనవాయితీ. శుక్రవారం నాగులపుట్టల వద్ద, ఆలయాల్లో నాగశిలల వద్ద మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగదేవత పుట్టలో పాలు పోసి చలిమిడి, సజ్జలు నైవేద్యాలుగా సమర్పించారు. అనంతరం పుట్ట చుట్టూ నాగదేవత రక్షణ కోరుతూ సంప్రదాయబద్ధంగా ధారాలు చుట్టారు. ఇందు కోసం ఆలయాల వద్ద, నాగుల పుట్టల వద్ద భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశారు. – సాక్షి, నెట్‌వర్క్



ఆత్మకూరులోని నాగదేవత పుట్ట వద్ద పాలుపోసి దారాలు చుట్టుతున్న భక్తులు



సంగంలో నాగశిలల వద్ద..



ఏఎస్‌పేట: నాగులపుట్ట వద్ద ..



జలదంకిలో నాగేంద్రుడి పుట్ట వద్ద..



ఉదయగిరి మండలం కుర్రపల్లెలో ..



దుత్తలూరులో పుట్ట వద్ద..



కొండాపురంలోని పుట్ట వద్ద..



వరికుంటపాడులో నాగులపుట్టకు..



కలిగిరిలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

డ్రైనేజీ పనులను ప్రారంభిస్తాం

- ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ



దుకాణదారులతో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట దర్గా ప్రాంతంలో ఆగిపోయిన డ్రైనేజీ కాలువల నిర్మాణాల పనులను త్వరలోనే చేపడుతామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఏ రంగప్రసాద్ అన్నారు. ఆయన శుక్రవారం కాలువలను పరిశీలించి మాట్లాడుతూ కొద్ది నెలల క్రితం దర్గా ప్రాంతంలో రోడ్డు వెడల్పు చేసేందుకు ఆక్రమణలు తొలగించామన్నారు. నూతనంగా డ్రైనేజీ కాలువల నిర్మాణాలు చేపట్టాల్సి ఉందని తెలిపారు. ఇందుకోసం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి రూ.60 లక్షలు నిధులను మంజూరు చేయించారన్నారు. కొంత మంది వ్యాపారస్తులు డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల మురికినీరు రోడ్లపై పారుతున్నాయని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన ఇక నుండి అటువంటి సమస్యలు ఏమి రావని తెలిపారు. ఆయన వెంట ఈఈ శ్రీనివాసులు, ఏఈ భవాని, రాజవోలు సొసైటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జిలానీ వ్యాపారస్తులు ఉన్నారు.

ఘనంగా సహకార వారోత్సవాలు



మాట్లాడుతున్న సొసైటీ అధికారి తిరుపాల్‌రెడ్డి


దుత్తలూరు: మండలంలోని కమ్మవారిపాళెం సొసైటీలో శుక్రవారం 70వ అఖిల భారత సహకార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కావలి డివిజనల్ కో ఆపరేటివ్ అధికారి కె.తిరుపాల్‌రెడ్డి, ఉదయగిరి సబ్ డివిజనల్ కో ఆపరేటివ్ అధికారి శ్రీనివాసరెడ్డి సహకార పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ రైతుల సహకారంతో నడిచే ఈ సహకార సంఘాలు రైతుల అభ్యున్నతి కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తాయన్నారు. సొసైటీల ద్వారా రైతులకు అవసరమైన రుణాలు, ఎరువులు, విత్తనాల సరఫరా, ధాన్యం సేకరణ జరుగుతున్నాయన్నారు. కమ్మవారిపాళెం సొసైటీ పరిధిలో మొత్తం నాలుగు గోదాములు నిర్మించామన్నారు. ఈ సొసైటీ పరిధి కింద విద్యుత్ చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని తీర్మానించారు. నందిపాడు సొసైటీ అధ్యక్షుడు మండ్ల శ్రీనివాసులు, సొసైటీ డైరెక్టర్ దేవరపాటి సురేంద్ర, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, సొసైటీ సీఈఓ లోకనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

కవి సమ్మేళనం



సంగం: సంగం శాఖా గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం కవి సమ్మేళనం నిర్వహించారు. మహాభారతాన్ని రచించిన నన్నయ్య, తిక్కన, ఎర్రాప్రగడ, రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి, ఆంధ్ర మహాభాగవతం రచించిన బమ్మెర పోతన పాండిత్యాన్ని కవులు వివరించారు. విశ్రాంత పీఏఓ కోటు దయాకర్‌రెడ్డి విద్యార్థులకు గ్రంథాలయం విశిష్టను వివరించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.

చదివే కొద్ది పెరిగేది విజ్ఞానం



సోమశిల: విద్యార్థులు బాల్యం నుంచే పుస్తకం పఠనం అలవాటు చేసుకోవడం వల్ల విజ్ఞానం పెరిగి జీవిత గమ్యాన్ని చేరుకోగలుగుతారని టీజీఎస్ఎం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం బత్రెడ్డి లక్ష్మీప్రసన్న సూచించారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో గ్రంథాలయాల ప్రాముఖ్యతను చాటుతూ ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ టీవీ, ఫోన్లు చూసే కంటే పుస్తకాలు చదవడం ఎంతో మేల తెలిపారు. లైబ్రేరియన్ డీ నారాయణరావు విద్యార్థులకు పుస్తక ప్రదర్శన, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మెట్టుకూరు సుబ్బారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కరీం మొహిద్దీన్ పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు భిక్ష

సంగం: స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో అయ్యప్ప మాలధారణలో ఉన్న అయ్యప్ప స్వాములకు గురుస్వామి పోలయ్య ఆధ్వర్యంలో శుక్రవారం భిక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు దాతల సహకారంతో జరుగుతున్న ఈ భిక్ష కార్యక్రమం అయ్యప్పస్వాములకు నెల రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.